క్లుప్తంగా

ఒంటిపూట బడులు ప్రారంభించండి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్‌పీకుంట: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడులు వెంటనే ప్రారంభించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు అధికమై వడగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని తెలిపారు. ఉదయం 10 గంటలు దాటితే ఎండ వేడిమి అధికంగా ఉంటున్నందున పిల్లలకు వడదెబ్బ తగిలి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్య రీత్యా ముందస్తుగా ఒంటిపూట బడులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామాంజనేయులు యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, రమణయ్య, షఫి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు విరాళం



చెక్కు అందజేస్తున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సత్ సేవాలాల్, మారెమ్మగుడి నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా నాయక్, రవినాయక్, వీరేనాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాగు రైతులకు పట్టాలు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎన్‌పీకుంట: మరికొమ్మదిన్నె పంచాయతీలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపట్టకుండా సాగు రైతులకు పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు పలువురు రైతులతో కలిసి సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో చాలా మంది రైతులు పంటలు సాగు చేసుకొని, పాడి పశువులు మేపుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న ఈ భూములలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడితే తాము ఎలా బతకాలని రైతులు ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, నాగరాజు, చిన్నమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుపై హర్షం

పుట్టపర్తి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపొందడంపై జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆలోచించే వ్యక్తిని గెలిపించడంపై ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రజనీకాంత్‌రెడ్డి, ఎర్రావలి, దామోదర్‌రెడ్డి, రామాంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, అజాద్, నరేంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు.

వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో బత్తలపల్లి విద్యార్థిని ప్రతిభ



అద్విక‌కు బహుమతి అందజేస్తున్న ఆర్గనైజర్లు

బత్తలపల్లి: విశ్వం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ ఆలిండియా పోటీల్లో బత్తలపల్లికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థిని అద్విక తృతీయస్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ధర్మతేజ, ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ తదితరులు విద్యార్థిని అద్విక, ఉపాధ్యాయుడు రమేష్‌ను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలిండియాలో వేదిక్ మ్యాథ్స్ పోటీలలో తృతీయ స్థానం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకులు.. పరుగులు



- ఓడీసీ విద్యార్థులకు కదిరిలో పరీక్ష కేంద్రాలు
- బస్సుల్లో రద్దీ.. ఆటోల్లో అదనపు వ్యయం
- సకాలంలో చేరుకునేందుకు పడరాని పాట్లు
- హడావుడితో పరీక్షపై కుదరని ఏకాగ్రత



కదిరి స్పేస్ జూనియర్ కాలేజీ వద్ద ఇంటర్ విద్యార్థుల హడావుడి

ఓడీచెరువు : ఇంటర్ పరీక్షలు విద్యార్థులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష. 15 నిమిషాలు ముందుగానే కేంద్రంలోకి చేరుకోవాలి. అయితే స్థానికంగా కాకుండా సుదూర ప్రాంతంలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడకు వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడీచెరువు మండలంలో మూడు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, రెండు ప్రభుత్వ అప్‌గ్రేడ్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 260 మంది దాకా ఉన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలయ్యాయి. అయితే పరీక్ష కేంద్రాలు మండల పరిధిలో కాకుండా 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కదిరి నియోజకవర్గ కేంద్రంలోనివి కేటాయించారు. కదిరి శివారు అనంతపురం రోడ్డులో బ్లూమూన్ జూనియర్ కాలేజీ, రాయచోటి రోడ్డులోని స్పేస్ జూనియర్ కాలేజీతో పాటు పట్టణంలో ప్రభుత్వ బాలుర, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలంటే విద్యార్థులు ఇంటి నుంచి ఏడు గంటలకే బయల్దేరాలి. ఆ సమయంలోపు అల్పాహారం సిద్ధమైన వారు మాత్రం తిని బయల్దేరుతున్నారు. ఆ సమయంలో బస్సు కూడా రద్దీగా ఉంటోంది. కదిరి సర్కిల్‌కు చేరుకున్నాక మరో నాలుగు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని పరీక్ష కేంద్రాలకు ఆటోల్లో ప్రయాణం చేయాలి. అమ్మాయిల పరిస్థితి అయితే మరీ ఘోరం. తెలియని ప్రదేశంలో పరీక్ష కేంద్రం చేరుకోవాలంటే కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు తోడు వెళ్లాల్సి ఉంది. ఇంతటి హడావుడి ప్రయాణం చేసిన తర్వాత అలసట కారణంగా పరీక్షలు సరిగా రాయలేని పరిస్థితి ఉంటోంది. స్థానికంగా పరీక్ష కేంద్రం ఉంటే ప్రశాంతంగా సావధానంగా పరీక్ష రాయవచ్చని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమయం వృథా అవుతోంది



కదిరిలో పరీక్ష కేంద్రం పడింది. అక్కడకు వెళ్లాలంటే కనీసం రెండు గంటల సమయం వృథా అవుతోంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆ సమయం చాలా కీలకమైనది. ప్రయాణ బడలిక వల్ల పరీక్షలను ఏకగ్రతతో రాయలేకపోతున్నాం. కనీసం మాకు ద్వితీయ సంవత్సరంలోనైనా పరీక్ష కేంద్రం ఓడీచెరువులో ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– కె.రెడ్డి శేఖర్, ఎంపీసీ ఫస్టియర్, ఓడీచెరువు

అమ్మాయిలంతా ఆటోల్లో వెళ్తున్నాం



అమ్మాయిలకు బస్సులో రద్దీ ప్రయాణం అంటే ఇబ్బందికరంగా ఉంటోంది. మా కేజీబీవీ ఇంటర్ విద్యార్థినులందరం కలిసి ఆటోలు బాడుగకు మాట్లాడుకున్నాం. అయినా నేషనల్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్నందున గతుకుల రోడ్లపై ప్రయాణం సాగించడానికి చాలా సమయం పడుతోంది. చాలా ఖర్చుతో కూడుకున్న పని. పరీక్షలు మధ్యాహ్నం 12గంటలకు అయిపోతే తిరిగి చేరడానికి రెండు గంటలకు పైనే అవుతోంది. ఆకలితో నకనకలాడిపోతున్నాం.

– కస్తూరి, ఇంటర్ సెకండియర్, ఓడీచెరువు

ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేనందునే...

ఓడీచెరువు మండల వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ జూనియర్ కాలేజీ కూడా లేదు. అనుభవం కలిగిన ప్రిన్సిపాళ్లు, సిబ్బంది లేరు. మండలంలో ఉన్న ఐదు కాలేజీల్లో మూడు ప్రైవేటువి కాగా.. మిగిలిన రెండు కళాశాలలు హైస్కూల్ నుంచి అప్‌గ్రేడ్ అయినవి. ఇటువంటి తరుణంలో పరీక్ష కేంద్రం ఇక్కడ ఏర్పాటు చేయలేకపోయాం.

– రఘునాథరెడ్డి, డీఐఈఓ

గెజిట్ ప్రకారమే సుంకాల వసూలు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్: తోపుడు బండ్ల వ్యాపారులు, రైతుల దగ్గర మున్సిపల్ గెజిట్ ప్రకారమే సుంకాలు వసూలు చేయాలని సీఐటీయూ నాయకులు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయు నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ పరిధిలో తోపుడు బండ్లకు, గంప వ్యాపారులకు, ఆటోలలో వ్యాపారం చేసేవారికి, సంత మార్కెట్‌కు కూరగాయలు తెచ్చే రైతుకు ఇతరత్ర వ్యాపారులకు కాంట్రాక్టర్లు గెజిట్ ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా సుంకాలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

ముదిగుబ్బ: అనారోగ్యం బారినపడేసే నాటుసారాను నిర్మూలిద్దామని ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి పిలుపునిచ్చారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు నాటుసారా నిర్మూలన కోసం నవోదయ 2.0లో భాగంగా టీఎన్ పాళ్యం, అడవి బ్రాహ్మణపల్లి తండాలలో సోమవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలను వేసి.. నాటుసారా నిర్మూలన, అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

లేపాక్షి: 'అందరి సహకారంతోనే లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు చొరవ చూపి సహాయ సహకారాలు అందించారు' అని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. సోమవారం లేపాక్షి దేవాలయంలో ప్రభుత్వ అధికారులకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముందుగా అధికారులతో వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మహేష్‌ను చైర్మన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్‌అహమ్మద్, ఎంఈఓ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీలత, ఏఈ వెంకటేశులు, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీ టూరిజం మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

పుట్టపర్తి టౌన్: పెద్దకమ్మవారిపల్లి సమీపంలోని చింతతోపులో పోతలప్ప, చెన్నకేశవ, లింగమయ్య స్వాముల ఉత్సవాలు రెండో రోజు సోమవారం వైభవంగా సాగాయి. ఉదయం అక్కమ్మ దేవతలకు పూజలు చేశారు. ఏడుగురు బాలికలను చల్లని నీటిలో స్నానం చేయించి, అక్కమ్మగార్లుగా అందంగా అలంకరించి, ఏడు చాటలతో పసుపు కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించి, డప్పు వాయిద్యాలతో దేవతలకు మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు పోతలప్ప దేవాలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదక్షణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



ధర్మవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్/ బత్తలపల్లి/ తాడిమర్రి/ కదిరిటౌన్/ముదిగుబ్బ/ ఓడీచెరువు : అన్ని పంటలకూ గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం, సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, కదిరి, ముదిగుబ్బ , ఓడీచెరువు తహసీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిప్రత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పంటలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేస్తూ అన్ని చెరువులకూ నీరు వదలాలన్నారు. సాగులో ఉన్న వారికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలన్నారు. పట్టు రైతుల ప్రోత్సాహక బకాయిలు రూ.72 కోట్లు వెంటనే జమ చేయాలన్నారు. పాల రైతులకు గిట్టుబాటు ధర, పశుగ్రాసం, దాణా వైద్య సౌకర్యాలు ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రకృతి విపత్తులతో పంటలు చేతికందకుండా పోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

చీడపీడలు నివారించుకోవాలి



దాడితోటలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉప సంచాలకులు మునిరెడ్డి

తాడిమర్రి: బొప్పాయి, మునగ, అరటి తోటలను ఆశించే చీడపీడలను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని గుంటూరుకు చెందిన ఉద్యానవన ఉప సంచాలకులు మునిరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని శివంపల్లి, దాడితోట గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి, మునగ, అరటి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. సీతాకాలం ముగిసే వరకూ పంటలకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. సరైన సమయంలో మందులు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం ఆయన దాడితోటలో ఓ రైతు అరటి పంటను కోస్తుండగా పంట దిగుబడి, ధర, మార్కెటింగ్ గురించి ఆరా తీశారు. ధర ఆశాజనకంగా ఉందని, అరటి సాగుకు రాయితీలు అందిస్తే కాస్త ఊరటగా ఉంటుందని రైతు తెలిపాడు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు రామాంజినేయులు, రైతులు పాల్గొన్నారు.

కాటమరెడ్డి రమణారెడ్డి సేవలు అమూల్యం



బహుమతులు, స్వీట్లు అందజేస్తున్న రమణారెడ్డి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు

కనగానపల్లి: విద్యాభివృద్ధికి కాటమరెడ్డి రమణారెడ్డి కుటుంబ సభ్యులు చేసిన సేవలను అందరూ గుర్తించుకోవాలని మామిళ్లపల్లి కేఆర్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం స్నేహలత తెలిపారు. సోమవారం పాఠశాలలో పాఠశాల మూలధనం (కార్పస్ ఫండ్) దాత అయిన కాటమరెడ్డి రమణారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థులకు బహుమతులు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి నిధి కోసం రమణారెడ్డి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి తల్లి కేశమ్మ, సోదరుడు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్వీ శివారెడ్డి, పీడీ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడి నిర్మాణానికి విరాళం

ఓడీచెరువు : నల్లగుట్లపల్లిలో నిర్మిస్తున్న సాయిబాబా గుడికి గ్రామానికి చెందిన సాతర్ల రమణమ్మ రూ.లక్ష విరాళం అందించి దాతృత్వం చాటుకుంది. ఈ సందర్భంగా రమణమ్మను గ్రామస్తులు శివారెడ్డి, చెన్నారెడ్డి శాలువా, పూలమాలతో సత్కరించి, సాయిబాబా చిత్ర పటాన్ని బహూకరించారు.

కంది పంట అగ్నికి ఆహుతి

కదిరి అర్బన్: చవిటితండా సమీపంలోని కొండకు సోమవారం ఆకతాయిలు నిప్పు పెట్టారు. క్రమంగా ఆ మంటలు సమీపంలోని పొలాల్లో కుప్పలు పోసిన కందిపంట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన 10 మంది రైతులు కందిపంటను కోసం కుప్పలు వేశారు. ఇప్పుడా కుప్పలన్నీ కాలిపోయాయి. తమకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

హేమావతిలో భక్తుల సందడి



రథాన్ని లాగడానికి వచ్చిన కాడెద్దులు



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని బ్రహ్మరథంపై కొలువుదీర్చగా భక్తుల శివ నామస్మరణ మధ్య రథాన్ని లాగారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. అరటిపండు, బెల్లం, కొబ్బరికాయ, పూలు, మిరియాలు తదితర వాటిని భక్తులు రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. వీరగాసేనృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరిస్తున్న సూపర్‌వైజర్ చంద్రమ్మ



కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న మహిళలు

బత్తలపల్లి: బాల్య వివాహాలు చేస్తే అనర్థాలు కొని తెచ్చుకున్నట్టేనని వక్తలు పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కోడేకండ్లలో మహిళా దినోత్సవం నిర్వహించారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చూసుకోవాలని, బాగా చదివించాలని వక్తలు పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని గుర్తు చేశారు. మహిళల పట్ల వివక్ష తగదని.. మహిళలుగా పుట్టినందుకు గర్వించాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి వాటికి మహిళల పేర్లు పెట్టారు. గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, కోడేకండ్ల సెక్టార్ అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మాయిలను బాగా చదివించాలి

గాండ్లపెంట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మలమీదపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు చేసి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, కమలమ్మ, సుకన్య, కళావతి, శోభ, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ర్యాలీ

తలుపుల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ రామానాయక్, తహసీల్దార్ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు, మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్రాముడు, వైద్యాధికారి అఫ్తాప్, ఏఎస్ఐ కృష్ణారెడ్డి, ఏపీఎం బాష్జీ పాల్గొన్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న సత్యసాయి



పర్తియాత్రను ప్రారంభిస్తున్న రత్నాకర్



బోనాలు మోస్తున్న విదేశీయులు



పురవీధుల్లో బతుకమ్మ

పర్తియాత్ర సంబరం

పుట్టపర్తి రూరల్: తెలంగాణ సత్యసాయి భక్తుల పర్తియాత్ర సంబరం అంబరమంటింది. పర్తియాత్రలో భాగంగా సోమవారం పుట్టపర్తిలోని హనుమాన్ సర్కిల్ వద్ద సత్యసాయి సెంట్రల్ మేనజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పూజలు నిర్వహించి మహా నగర సంకీర్తన ప్రారంభించారు. అశ్వవాహనంపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి మంగళవాయిద్యాలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఊరేగించారు. జ్యోతులు, బోనాలు, బతుకమ్మ కోలాటాలు, పండరి భజనలు, సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గేయాలతో పురవీధులు మార్మోగాయి. సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని మూడు రోజుల పర్తియాత్రను ముగించారు.

'సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

చెన్నేకొత్తపల్లి: గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచిన వారందరికీ ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వొద్దంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఓబుగారి హరినాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా గెలిచాక పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజలకు పథకాలు అందించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత సీఎం చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రతి వలంటీర్‌కు రూ.పది వేల జీతం ఇస్తామని చెప్పి.. నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. గతంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రులు బాధ్యతాయుతంగా పేద ప్రజల సంక్షేమాభివృద్ధికి పని చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు సంక్షేమ పథకాలను ఇవ్వరాదని చెప్పడం సరికాదని హితవు పలికారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు.

మహిళల భద్రత, చట్టాలపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా అంతటా అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు పోలీస్ అధికారులు 'మహిళల భద్రత- చట్టాలు'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పరిశీలించారు.

పాఠశాల స్థలం సర్వే

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భూమిని అధికారుల ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. బాలాజీ లక్ష్మణదాస్ తన పేరిట ఉన్న 9.5 ఎకరాల భూమిని పాఠశాల నిర్మాణానికి దానంగా ఇచ్చారు. అయితే ఈ స్థలం అన్యాక్రాంతం కావడంతో ఆయన వారసులు రవికుమార్ తన తాత ఇచ్చిన ఆస్తిని పాఠశాలకు వాడుకోవాలని, అక్రమార్కులు ఆక్రమణ చేస్తున్నారని వెంటనే భూమిని కొలత వేసి హద్దులు గుర్తించాలని తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించారు. స్పందించిన అధికారులు సోమవారం సర్వే చేపట్టారు.